క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ ఫీడర్ పరిధిలోని గాన్‌గట్టుతండా, చెర్కూర్, భర్కత్‌పల్లి గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు శనివారం విద్యుత్ ఏఈ జానకిరామ్‌నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు, విద్యుత్ వినియోగం దారులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ నిలపాలి

పెద్దకొత్తపల్లి: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ వెంటనే నిలిపివేయాలని టీఎస్ యూ టీ ఎఫ్ మండల అధ్యక్షుడు గౌస్‌పాషా, ప్రధాన కార్యదర్శి మల్లయ్యలు కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుతం బడిబాట కొనసాగుతుందని కొత్తగా విద్యార్థులు పాఠశాలలో చేరే అవకాశం ఉందని విద్యార్థుల సంఖ్యను అనుగుణంగా సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలన్నారు. బడిబాట పూర్తి కాకముందే చేపడితే ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ



తిమ్మాజిపేట: మండలంలోని పోతిరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శనివారం లబ్ధిదారులతో కలిసి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్యగౌడ్ భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నాణ్యతగా ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. అదేవిధంగా రెండో విడత కూడ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తిరుపతయ్య, గ్రామ అధ్యక్షుడు చిన్నరాములు, నాయకులు జంగిరెడ్డి, జంగయ్య, నిరంజన్, ఆంజనేయులు, తాతన్న, చందు, వెంకటయ్య, నాగయ్య, నర్సింహ, బంగారు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

ఉప్పునుంతల: సీపీఎం ఆధ్వర్యంలో 11న తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్ దేశ్యానాయక్ కోరారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు భరోసా, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు ఇవ్వాలన్నారు. చింతల నాగరాజు, నాయకులు శివకుమార్, కిష్టయ్య, వెంకటయ్య తదితులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



పెద్దకొత్తపల్లి: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని కాంగ్రెస్ నాయకుడు డా.పడిగాల శ్రీనివాసు అన్నారు. శనివారం మండల కేంద్రంలో దండు యువసేన ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్ సీజన్ -2 క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. నిర్వాహకుడు మల్లేష్, దండు నర్సింహ, వెంకటేశ్వర్‌రావు, లక్ష్మణ్‌రావు, వెంకటేశ్వర్‌రెడ్డి, చిన్నయ్య, బాలునాయక్, రవికుమార్, బద్యానాయక్ పాల్గొన్నారు.

మెడికల్ కిట్ల పంపిణీ



వెల్దండ: మండలంలోని రాచూర్‌లో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం గర్భిణులకు మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు బీఆర్ఎస్ కార్యకర్తల ద్వారా కిట్లను పంపిణీ చేస్తున్నామని ట్రస్ట్ నిర్వాహకులు పేర్కొన్నారు. మాజీ సర్పంచ్‌లు జయమ్మ, యాదయ్య, మాజీ ఎంపీటీసీ గుత్తి వెంకటయ్యయాదవ్, బాలకృష్ణ, బీరయ్య, జంగయ్య, ఎల్లయ్య, అంజయ్య, మల్లయ్య, జంగయ్య, ఆశా కార్యకర్తలు, ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

లింగాల: మండలంలోని కోమటికుంటలో శనివారం ఆంజనేయస్వామి ఆలయం ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఎత్తపు లక్ష్మణ్‌రావు, వైస్ చైర్మన్ దయానంద్, కమలాకర్, గుడిస్వామి, ఆనంద్‌రావు, సుధాకర్‌రావు, జి.శ్రీనివాసులు, చిన్నారెడ్డి, జంగయ్య, రాముడు, శివ, రామకృష్ణ, మల్లేష్, లింగారెడ్డి, రంగినేని సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అడవి బిడ్డలకు ఆర్డీటీ చేయూత

- చెంచుల జీవితాల్లో వెలుగులు
- ఉచితంగా ఇళ్ల నిర్మాణాలు



సీబీ తండాలో ఆర్డీటీ సంస్థ నిర్మించిన అధునాతన చెంచుల ఇళ్లు

ఉప్పునుంతల: కొన్ని సంవత్సరాల నుంచి చెంచులను పాలకులు పట్టించుకోలేదు. వారిక కనీస వసతులు కల్పించడంలో విఫలం అయ్యారు. పాలకుల పట్టింపులేక, ప్రభుత్వ సాయానికి నోచుకోక కటిక దారిద్రంలో మగ్గిన చెంచులను ఆదుకునేందుకు ఆర్డీటీ సంస్థ ముందుకొచ్చింది. మండలంలోని మారుమూల సీబీ తండా చెంచులకు మంచి రోజులు వచ్చాయి. ఆర్డీటీ సంస్థ వారి సహాయ సహకారం, ప్రోత్సాహంతో చెంచుల జీవన విధానంలో ఎంతో మార్పు వచ్చింది. సంస్థ నుంచి ఏడేళ్ల కిందట చెంచులకు అధునాతన ఇళ్లను నిర్మించి ఇవ్వడంతోపాటు వారి విద్య, వైద్యం తదితర అంశాలపై సంస్థ ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో చెంచులు సంతోషంగా జీవిస్తున్నారు. గతంలో ఇళ్లు లేకపోవడం, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే చెంచులు ప్రస్తుతం గ్రామంలోనే ఉపాధి పనులకు వెళ్తున్నారు. మరి కొంతమంది గతంలో ప్రభుత్వం నుంచి ఇచ్చిన భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

చెంచు కుటుంబాలకు ఇళ్ల నిర్మాణాలు..

సీబీ తండాలో మొత్తం 24 చెంచు కుటుంబాల్లో 120 మంది వరకు చెంచుల జనాభా ఉంది. గతంలో చెంచుల కోసం ప్రభుత్వం నుంచి నాసిరకంగా నిర్మించి ఇచ్చిన శిథిలావస్థవు ఇళ్లను పడగొట్టి వాటి స్థానంలోనే ఆర్డీటీ సంస్థ నుంచి 24 ఇళ్లను కొత్తగా నిర్మించి ఇచ్చారు. ఒక్కో ఇంటికి రూ. 2.30 లక్షలు ఖర్చు చేశారు. ఇళ్ల నిర్మాణంలో చెంచులను భాగస్వామ్యులను చేస్తూ నాణ్యతలో ఏమాత్రం రాజీ పడకుండ జాగ్రత్త పడ్డారు. గతంలో ప్రభుత్వం నుంచి మంజూరైన నాసిరకం ఇళ్లలో ఇబ్బందులుపడిన చెంచులు ప్రస్తుతం సంస్థ నిర్మించి ఇచ్చిన ఇళ్లలో సంతోషంగా జీవిస్తున్నారు.

వైద్య సేవలపై శ్రద్ధ

చెంచు మహిళ వెంకటమ్మకు కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌గా శిక్షణ ఇచ్చారు. జ్వరం, జలుబు, చిన్న రోగాలకు సంబంధించిన ఔషధాలను అందుబాటులో ఉంచారు. తండాలో వారానికి ఒక సారి మొబైల్ క్లినిక్‌ను నిర్వహించి వైద్య పరీక్షలు చేస్తున్నారు. స్థానికంగా వ్యాధి నయంకాని రోగులను సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మన్ననూర్ తదితర ప్రాంతాల్లో ఉన్న ఆస్పత్రులకు అంబులెన్స్‌లో తీసుకెళ్లి చికిత్సలు చేయిస్తున్నారు.గర్భిణులకు, బాలింతలతోపాటు చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తూ చెంచులను రాగులు,గుడ్లు, బొబ్బర్లు, పెసల్లు, బెల్లం,పిండి వంటిపౌష్టికాహారాన్ని అందిస్తున్నారు.

ఆర్థికాభివృద్ధికి సహకారం

చెంచులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ఆర్థికసాయం అందజేస్తున్నారు. ఒక్కొక్కరి రూ. లక్ష చొప్పున అందించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. నల్లబోతుల వెంకటమ్మ, దాసరి లింగమ్మ, దాసరి బుచ్చమ్మ అనే ముగ్గురు చెంచు మహిళలకు మేకల పెంపకం కోసం ఆర్థికసాయం చేశారు.

విద్యాభివృద్ధికి..

చెంచుల పిల్లలను చదువుకోవడానికి ఆర్డీసీ సంస్థ వారు ఆర్థికంగా చేయూతనందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. సైదమ్మ, ఇదయ్య అనే చెంచు విద్యార్థులను ఇంటర్ నుంచి సంస్థ వారే ఫీజులు చెల్లించి కర్నూల్, హైదరాబాద్‌లోని కార్పొరేట్ కళాశాల్లో చదివించారు. గ్రామంలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న చెంచు విద్యార్థులకు స్కూల్ మెటీరియల్, న్యూట్రిషన్ ఫుడ్‌ను అందిస్తున్నారు.

ఆర్డీటీ సంస్థకు రుణపడి ఉంటాం



ఆర్డీటీ సంస్థ వారు ఇళ్లు నిర్మించి ఇచ్చారు. వారికి ఎల్లప్పుడు రుణపడి ఉంటాం. ఏదైనా రోగం వస్తే మందులు కూడా ఉచితంగా ఇస్తున్నారు. పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. వారి సహకారం తో మా జీవన విధానంలో చాలా మార్పు వచ్చింది. ఆర్డీటీ సంస్థకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– నల్లబోతుల చంద్రయ్య, చెంచు, సీబీ తండా

మెరుగైన వైద్యం అందించాలి

కల్వకుర్తి రూరల్: మండలంలోని ఎల్లికట్ట గ్రామానికి చెందిన భూపాల్ రెడ్డి అనారోగ్యంతో మహబూబ్‌నగర్‌లో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు రాకేష్ శర్మ, దామోదర్ గౌడ్, గోలి సుదర్శన్ రెడ్డి, చిలుక వెంకటరెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన నేరటి అర్జున్ అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బి మధు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, రామ రాజ్, శేఖర్, గోపాల్, చిరంజీవి, నరేందర్, విష్ణు తదితరులు ఉన్నారు.

ఘనంగా బొడ్రాయి రెండో వార్షికోత్సవం



తెలకపల్లి: మండలంలోని అనంతసాగర్‌లో శనివారం బొడ్రాయి రెండో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బొడ్రాయికి పాలతో అభిషేకం చేసి పూజలు చేశారు. వీధులను వేప ఆకులతో ముస్తాబు చేశారు. ఆడపడుచుల సందడి నెలకొంది. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా



కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాల గ్రామ సమీపంలో లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఎస్ఐ మాధవరెడ్డి వివరాల ప్రకారం జడ్చర్ల నుంచి కోళ్ల దాన లోడ్‌తో లారీ శనివారం దేవరకొండ వైపు వెళ్తోంది. మార్చాల సమీపంలో ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేస్తున్న క్రమంలో ద్విచక్రవాహనం రావడంతో దీనిని తప్పించే క్రమంలో లారీ అదుపుతప్పి బోల్తా పడింది. లారీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపాడు.

పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఆటో



పాన్‌గల్: అదుపుతప్పి ఆటో పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తెల్లరాళ్లపల్లితండాకు చెందిన శ్రీనునాయక్ కుటుంబం తండా నుంచి హైదరాబాద్‌కు ఆటోలో వెళ్తున్న క్రమంలో దావాజిపల్లి స్టేజీ సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి వ్యవసాయ పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో ఆటోలో ఉన్న ఐదుగురి కుటుంబ సభ్యుల్లో ఒక మహిళకు రక్త గాయాలయ్యాయి. ఆటో అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఓ చెట్టుకు తాకి ఆటో ఆగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. క్షతగాత్రురాలిని వెంటనే ప్రైవేట్ వాహనంలో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

చెంచులకు 'వాటర్ ఆన్ వీల్' పంపిణీ



వాటర్ ఆన్ వీల్‌లను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

మన్ననూర్: అమ్రాబాద్ మండలం బీకే ఉప్పునుంతల గ్రామానికి చెందిన చెంచు కుటుంబాలకు రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ సహకారంతో శనివారం వాటర్ ఆన్ వీల్ పంపిణీ చేశారు. నీళ్లు తెచ్చుకునేందుకు చెంచులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను కోనేరు సంస్థ సభ్యుడు బాలకృష్ణ సంస్థ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సంస్థ నిర్వాహకులు గ్రామంలోని చెంచు కుటుంబాల వారందరికి ఒక్కొక్కటి చొప్పున వాటర్ ఆన్ వీల్‌ను సమకూర్చి అందజేశారు. కొనిన రోజుల కిందట ఈదయ్య ఇల్లు అగ్నికి ఆహూతి కావడంతో ఇంటిలోని వస్తువులు కాలిపోవడంతో బాధితుడికి వంట సామాగ్రి, దుస్తులు తదితరాలు అందజేశారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ రఘు, రోటరీ క్లబ్ బృందం, కోనేరు సంస్థ సభ్యులు తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

వీపగనండ్ల: మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మండల మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘం నాయకులు నక్క వెంకటస్వామి, సంగనమోని వెంకటయ్య, మిద్దె శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న కలెక్టరేట్ ఎదుట నిరసన నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. మండలంలోని మత్స్యకారులు అధిక సంఖ్యలో నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని వారు కోరారు. మండల కేంద్రంతో పాటు గోవర్ధనగిరిలో నిరసనకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. వీరికి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మేకల ఆంజనేయులు తన మద్దతు ప్రకటించారు.



ప్రమాదకరంగా మలుపులు



వెల్దండ మండలం బైరాపూర్ వాగు సమీపంలో ప్రమాదకరమైన మూలమలుపు



వెల్దండ -చారకొండ రోడ్డులో బొల్లిగుట్టవద్ద ఎలాంటి సూచిక బోర్డులేని మూలమలుపు

వెల్దండ: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు ప్రమాదకరంగా మారాయి. మూల మలుపుల వద్ద వాహనదారుల ఇబ్బందులు పడుతున్నారు. వెల్దండ-చారకొండ ఆర్అండ్‌బీ రోడ్డులో ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడి గాయాలైన ఘటనలు ఉన్నాయి. మండలంలోని బైరాపూర్ వాగు సమీపంలో ఉన్న మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. గతనెల 17న రాత్రి కొట్ర గ్రామానికి చెందిన భూత్కురి రమేష్ అనే యువకుడు బైక్‌పై బైరాపూర్ నుంచి కొట్రకు వెళ్తుండగా మూలమలుపు వాహనం అదుపు తప్పి గోతిలో పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహన దారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య



రాళ్లచెరువుతండాలో బడిబాటలో పాల్గొన్న ఎంఈఓ సత్యనారాయణ శెట్టి

తిమ్మాజిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని ఎంఈఓ సత్యనారాయణ శెట్టి అన్నారు. శనివారం మండలంలోని రాళ్లచెరువుతండా, ఆవంచ, బుద్దసముద్రం, నేరళ్లపల్లి తదితర గ్రామాల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఉపాధ్యాయులతో కలిసి ఎంఈఓ బడి మానేసిన విద్యార్థుల ఇంటికి వెళ్లి పిల్లలను బడికి పంపించాలని తల్లి దండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని, విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, రెండు జతల బట్టలు, మధ్యాహ్నం భోజనం, డిజిటల్ విద్యాబోధన, విశాలమైన పాఠశాల గదులు, క్రీడా మైదానం తదితర సౌకర్యాలను స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

మన్ననూర్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టినట్లు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం అమ్రాబాద్ మండల కేంద్రంలోని బీకే ఫంక్షన్ హాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసి మాట్లాడారు. నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ పీడీ సంగప్ప, కాంగ్రెస్ పార్టీ అమ్రాబాద్, పదర మండల అధ్యక్షులు హరినారాయణ గౌడ్, రామలింగం యాదవ్, వర్కింగ్ ప్రసిడెంట్ ఆనంద్, అమ్రాబాద్, పదర ఎంపీడీఓలు లింగయ్య, వెంకటయ్య, డాక్టర్ వెంకటయ్య, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, బాలింగం గౌడ్, నాయకులు చిన్న చంద్రయ్య, కోరె రేణయ్య, సంతోష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఉప్పునుంతల: మండలంలోని లత్తీపూర్‌కు చెందిన మూడావత్ సర్రామ్ నాయక్ శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్టా అనంత రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు శేఖర్‌గౌడ్, స్థానిక నాయకులు, తదితరులు ఉన్నారు.

కురిసిన వర్షం.. అన్నదాత హర్షం

కల్వకుర్తి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు దుక్కి దున్ని పొలం సిద్ధం చేసుకున్నారు. మే నెలలో కురిసిన వర్షాలతో మెట్ట పంటలు సాగు చేసే రైతులు తమ పొలాలలో జొన్న, పత్తి విత్తనాలు సాగు చేశారు. కాగా పది రోజులుగా వర్షం జాడ లేకపోవడంతో అన్నదాతలలో ఆందోళన చెందారు. శనివారం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షం కురిసింది. మొక్కలు ఎండిపోతాయేమోనని భయాందోళనలతో ఉన్న సమయంలో వరుణుడు కరుణించడంతో రైతన్న ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మార్చాల, జిల్లెల్ల, కురుమిద్ద, ఎంగంపల్లితో పాటు పలు గ్రామాలలో గంట పాటు వర్షం కురిసింది.



మార్చాలలో మొలకెత్తిన జొన్న

ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



నాగర్‌కర్నూల్‌లో శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



కల్వకుర్తిలో శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా శనివారం బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదులు, ఈద్గాలను అందంగా ముస్తాబ్ చేశారు. ఉదయం ఈద్గాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ధార్మిక సందేశం ఇచ్చారు. పేదలకు ఖుర్బానీ అందజేశారు. కల్వకుర్తిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేటలో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కల్వకుర్తి, తిమ్మాజిపేట, ఉప్పునుంతల, తెలకపల్లి, తాడూరు, పెద్దకొత్తపల్లి, లింగాల, వెల్దండ, చారకొండ, అమ్రాబాద్, బల్మూరు, దోమలపెంటల, మన్ననూర్, ఊర్కొండలలో సామూహిక ప్రార్థనలు చేశారు.



తాడూరులో..



కల్వకుర్తిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఉప్పునుంతల వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



దోమలపెంటలో..



పెద్దకొత్తపల్లిలో..



మన్ననూరులో..



వెల్దండ మండలం కుప్పగండ్లలో ..



లింగాలలో..

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
నాగర్‌కర్నూల్ - జి. సంపత్ కుమార్ - 88865 67081
కొల్లాపూర్ - వై. కురుమూర్తి - 79979 58205
అచ్చంపేట / కల్వకుర్తి - యం. విజయ్ - 99630 23777

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబరు :

పి. మధుసూదన్ గౌడ్ : 90100 06785